ఒక్క మాత్రతో నులిపురుగులకు చెక్



చిన్నారికి నులిపురుగులు నివారణ మాత్ర వేస్తున్న వైద్య సిబ్బంది

- తొమ్మిది పీహెచ్‌సీల పరిధిలో మాత్రల పంపిణీ
- 60 శాతం చిన్నారుల్లో రక్తహీనతకు నులిపురుగులే కారణం

కోవూరు : చిన్నారుల జీవితాలను నులిపురుగులు నులిమేస్తున్నాయి. పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయి. 60 శాతం చిన్నారుల్లో నులిపురుగులు రక్తహీనతకు దారితీస్తాయి. శారీరక, మానసిక ఎదుగుదలకు ఆటంకంగా మారుతాయి. కడుపులో చేరి నొప్పి, మంట, వికారం కలుగచేస్తాయి. దీని వల్ల ఆహారంపై ఇష్టం లేక ఆకలి ఉండదు. దీంతో పిల్లలు నీరసపడతారు. వ్యాధి నిరోధకశక్తి తగ్గుతుంది.

అపరిశుభ్రత కూడా..

అపరిశుభ్రత వల్లే నులిపురుగులు ఎక్కువగా వ్యాపిస్తాయి. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించని వారికి నులిపురుగుల సమస్య ఎక్కువగా ఉంటుంది. పిల్లలు చేతిగోళ్లను శుభ్రంగా ఉంచుకోవాలి. బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన ద్వారా కూడా నులిపురుగులు మన శరీరంలోకి చేరే అవకాశం ఎక్కువ. పిల్లల్లో మూడు రకాల నులి పురుగులు ఉండే అవకాశం ఉన్నాయి. అవి ఏలిక పాములు, కొంకి పురుగులు, నులి పురుగులు. వీటిని నిర్మూలించేందుకు ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవాలి. మాత్ర వేసుకున్న ఒక రోజు లేదా రెండు రోజుల్లో నులిపురుగులు ఉన్నట్టైతే మల విసర్జన ద్వారా బయటకు వెళ్తాయి. ఏడాది నుంచి రెండేళ్ల వయసున్న చిన్నారులకు 200 మిల్లీ గ్రాములు (సగం మాత్ర), రెండేళ్ల నుంచి 19 సంవత్సరాల వయస్సు 400 మిల్లీగ్రాములు ఒక మాత్ర చొప్పున మింగాల్సి ఉంటుంది.

ఆల్బెండజోల్‌తో నివారణ

పిల్లల్లో అనేక రకాల అనారోగ్యానికి కారణమవుతున్న నులి పురుగులను కేవలం ఒకే మాత్ర ఆల్బెండజోల్‌తో నివారించవచ్చు. కోవూరు నియోజకవర్గ పరిధిలోని తొమ్మిది పీహెచ్‌సీల వైద్యులు, సిబ్బంది నులి నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్నారు.

కోవూరు నియోజకవర్గంలో తొలిరోజు ఆల్బెండజోల్ మాత్రలు వేసుకున్న వారి వివరాలు ఇలా..

మండలం	పీహెచ్‌సీ	పిల్లల సంఖ్య	మాత్ర వేసుకున్న వారు	మిగిలిన వారు
కోవూరు	ఇనమడుగు	14,826	13,624	1,202
ఇందుకూరుపేట	జగదేవిపేట	4,800	4,518	282
	మైపాడు	6,603	6,073	530
కొడవలూరు	యల్లాయపాళెం	3,087	2,989	98
	కొడవలూరు	7,912	7,753	159
విడవలూరు	రామతీర్థం	4,299	4,180	119
	విడవలూరు	4,712	4,673	39
బుచ్చిరెడ్డిపాళెం	జొన్నవాడ	7,907	7,428	479

నమిలి మింగాలి

ఆల్బెండజోల్ మాత్రను చిన్నారులు చేత నమిలి మింగించడం ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయి. మాత్ర తీసుకోవడం ద్వారా నులిపురుగులు నిర్మూలన అవుతాయి. ఫలితంగా రక్తహీనతను నియంత్రించవచ్చు. వ్యాధి నిరోధక శక్తి మెరుగుపడుతుంది. ఏకాగ్రత, పని సామర్థ్యం పెరుగుతుంది.
– డాక్టర్ ఇర్ఫాన్, ఇనమడుగు పీహెచ్‌సీ

కనీస వేతనం వచ్చేలా పనులు చేయాలి

- డ్వామా పీడీ వెంకటరావు



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకటరావు

పొదలకూరు: ఉపాధి హామీ పనులు చేసే కూలీలకు కనీస వేతనం రూ.257 గిట్టుబాటు అయ్యేలా పనులు చేయాలని డ్వామా పీడీ డి.వెంకటరావు సూచించారు. మండలంలోని మొగళ్లూరు గ్రామంలో మంగళవారం ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కూలీలతో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మొగళ్లూరు గ్రామంలో కూలీలకు రూ.230 కూలి వస్తున్నట్లు తెలిపారు. కనీస వేతనం రూ.257 వరకు పెంపొందించుకోవాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు కోటి పనిదినాలను పూర్తిచేశామని, మార్చి నెలాఖరుకు మరో 15 లక్షల పనిదినాలను పూర్తిచేస్తామని తెలిపారు. 1.15 కోట్ల పని దినాలను పూర్తి చేయడం లక్ష్యమని తెలిపారు. ఆయన వెంట టీఏ వెంకటసాయి, ఎఫ్ఏ మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

ఆంజనేయస్వామికి విశేష పూజలు



విశేషాలంకరణలో ఆంజనేయస్వామి

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామికి మంగళవారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, ప్రత్యేక పూజలు, తిరిగి సాయంత్రం స్వామికి పూజలు, పల్లకిసేవ గావించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

- రూ.లక్ష ఆస్తి నష్టం



బాధితులకు సాయం అందజేస్తున్న దాతలు

కోవూరు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పూరిల్లు దగ్ధమై సుమారు రూ.లక్ష వరకు ఆస్తి నష్టం జరిగిన సంఘటన మండలంలోని పోతిరెడ్డిపాళెం తిప్పగిరిజన కాలనీ వద్ద మంగళవారం చోటుచేసుకొంది. వివరాలు.. పోతిరెడ్డిపాళెం తిప్ప గిరిజనకాలనీలో నివాసం ఉంటున్న తలపల రాణి ఇంటి ముందు పనిచేస్తున్న సమయంలో పూరింట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. ఇల్లంతా మంటలు వ్యాపించి పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లోని గృహోపకరణాలు, దుస్తులు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న పోతిరెడ్డిపాళెం సర్పంచ్ నలుబోలు శ్రీవాణి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నలుబోలు సుబ్బారెడ్డి వెంటనే బాధితురాలి కుటుంబానికి రూ.5 వేల నగదు, బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అల్లం రాజా, జానా వెంకటేశ్వర్లుగౌడ్, గాజుల మల్లికార్జునరావు, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఏకాగ్రతతో చదివితే మంచి ఫలితాలు

కొడవలూరు : విద్యార్థులు ఏకాగ్రతతో చదివితే మంచి ఫలితాలు సాధిస్తారని ఇస్కాన్ ట్రస్టు యూఎస్ఏ ప్రతినిధి కృష్ణ చైతన్య స్వామి సూచించారు. నార్తురాజుపాళెంలోని వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనలియర్ విద్యార్థులకు 'కెరీర్ గైడెన్స్' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా ఆయన హాజరై, మాట్లాడారు. విద్యార్థులు ఆధ్యాత్మిక విలువలు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఇస్కాన్ ట్రస్టు నెల్లూరు శాఖ హెడ్ డాక్టర్ సుఖదేవ్‌స్వామి, రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఒమ్మిన సతీష్‌బాబు, కళాశాల డైరెక్టర్ జె.చంద్రమౌళి, ప్రిన్సిపల్ పి.కుమార్‌బాబు, టీపీఓ కె.శ్రీకాంత్ పాల్గొన్నారు.

సత్తాచాటిన ఇందుకూరుపేట విద్యార్థులు



గెలుపొందిన విజేతలు

ఇందుకూరుపేట : చిలకలూరిపేటలో జరిగిన జవహర్‌లాల్ మెమోరియల్ ఇంటర్‌స్టేట్ కరాటే చాంపియన్ షిప్–2023 పోటీల్లో ఇందుకూరుపేటకు చెందిన విద్యార్థులు సత్తాచాటారు. మార్చి 12న జరిగిన పోటీల్లో వివిధ విభాగాల్లో గోల్డ్, సిల్వర్, బ్రాంజి మెడల్స్ సాధించారు. వీరిలో లాస్య(గోల్డ్ మెడల్) సాయి సాత్విక్(సిల్వర్), దినేష్(సిల్వర్), హరిహరన్(సిల్వర్), గిరిధర్(బ్రాంజి) సాధించారు. వీరితో పాటు జిల్లా నుంచి పలువురు క్రీడాకారులు పతకాలు సాధించారు. కాగా వీరిని మండల వాసులు మంగళవారం అభినందించారు.

దాడిపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): ఓ వ్యక్తిపై దాడి చేసిన వారిపై సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు..కలారిపాళేనికి చెందిన జీ కిషోర్ సైన్‌బోర్డు ఆర్టిస్ట్. ఆయన తన ఇంటివద్దే అంగడి పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. గతేడాది ఆయన షాపులోని సెల్‌ఫోన్ అపహరణకు గురైంది. పక్కనే ఉన్న ఫర్నీచర్‌షాపులోని సీసీ కెమెరాలను పరిశీలించగా స్థానికంగా ఉన్న ఓ యువకుడు దొంగలించాడని తేలడంతో సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిని మనస్సులో పెట్టుకున్న యువకుడి అమ్మ సుమ, బంధువులు మమత, బీనారి, పద్మ, అరుణ్ మరికొందరు ఈ నెల 9న రాత్రి కిషోర్‌పై దాడిచేశారు. గాయాలపాలైన ఆయన ఆస్పత్రిలో చికిత్స పొంది ఈ నెల 13న డిశ్చార్జి అయ్యారు. ఈ మేరకు మంగళవారం ఆయన సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మర్యాదపూర్వకంగా..



సజ్జల రామకృష్ణారెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ప్రసన్న, విజయకుమార్



మంత్రి అప్పలరాజుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ప్రసన్న, విజయకుమార్

కోవూరు : రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజును కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడలోని వారి క్యాంపు కార్యాలయాల్లో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా విజయకుమార్‌ను ఎంపిక చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

ఎకరాకు నాలుగు పుట్ల దిగుబడి

- పలు గ్రామాల్లో పంటకోత ప్రయోగాలు



కృష్ణపట్నం సమీపంలో పంటకోత ప్రయోగం నిర్వహిస్తున్న అధికారులు

ముత్తుకూరు : మండలంలోని పలు గ్రామాల్లో జిలకర మసూర, సాంబ మసూర రకాలకు చెందిన వరి పొలాల్లో పంటకోత ప్రయోగాలు నిర్వహించగా, ఎకరాకి నాలుగు పుట్ల వరి ధాన్యం దిగుబడి వచ్చినట్లు గుర్తించారు. కృష్ణపట్నం రైతు భరోసా కేంద్రం పరిధిలో మంగళవారం దార మల్లికార్జున పొలంలో పంటకోత ప్రయోగం నిర్వహించారు. 25 చదరపు మీటర్ల మేరకు వరి కోతలు చేశారు. ఈ మేరకు ధాన్యాన్ని కొలిచారు. 21.900 కిలోల మేరకు దిగుబడి వచ్చింది. వీటి లెక్కల ప్రకారం ఎకరాకు నాలుగు పుట్లు ధాన్యం దిగుబడి వచ్చింది. కార్యక్రమంలో అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ రీజనల్ మేనేజర్ శివశంకర్‌మూర్తి, అడ్మిన్ ఆఫీసర్ బలరామ్, జిల్లా కో–ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, వ్యవసాయ సహాయకుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ ఏఈ గౌస్‌మొహిద్దీన్

బుచ్చిరెడ్డిపాళెం : జగనన్న లేఅవుట్లలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి త్వరగా పూర్తయ్యేలా చూడాలని హౌసింగ్ ఏఈ గౌస్‌మొహిద్దీన్ తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెంలోని పెద్దూరులో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉగాది నాటికి లక్ష్యంగా పెట్టుకున్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు, కాంట్రాక్టర్లు నిర్మించే ఇళ్లకు సంబంధించి నాణ్యతలో ఎలాంటి లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని, ఇందుకు లబ్ధిదారులు కూడా నిత్యం పర్యవేక్షించుకోవాలని సూచించారు. అలాగే లబ్ధిదారులు సొంతంగా నిర్మించుకునే ఇళ్లు కూడా త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఆయన వెంట సిబ్బంది మల్లి ఉన్నారు.

పరిశుభ్రత.. మనందరి బాధ్యత

- కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి



మహిళలకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చి నగర పంచాయతీని పరిశుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యత అని కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. పరిసరాల పరిశుభ్రతపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా బుచ్చిరెడ్డిపాళేన్ని చెత్త రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఇంట్లోని చెత్తను రోడ్లపై వేయకుండా పారిశుద్ధ్య కార్మికులకు ఇచ్చి సహకరించాలని సూచించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

వెండి సామగ్రి బహూకరణ



వెండి సామగ్రిని అందజేస్తున్న దాతలు

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున స్వామి సమేత కామాక్షి తాయి అమ్మవారికి దాతలు మంగళవారం పలు వెండి సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు మాట్లాడుతూ విశాఖపట్నానికి చెందిన మద్దెల వెంకట లక్ష్మీప్రసాద్–వెంకట వీరరాఘవమ్మ దంపతులు శ్రీవార్ల నిత్య కైంకర్యాలకు 302 గ్రాముల 670 మిల్లీగ్రాముల బరువు కలిగిన వెండి చెంబు, మూత, ఉద్ధరిణిలను అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి దాతలను శేషవస్త్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఈఓ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

విజయవంతంగా డీవార్మింగ్ డే



ముత్తుకూరు : బ్రహ్మదేవిలో చిన్నారికి నులి పురుగుల నివారణ మాత్ర వేస్తున్న సిబ్బంది

- పాఠశాలల చిన్నారులకు నులిపురుగుల నివారణ మాత్రలు

ముత్తుకూరు : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం(డీ వార్మింగ్ డే) మంగళవారం అన్ని మండలాల్లో విజయవంతంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ముత్తుకూరులోని జెడ్పీ హైస్కూళ్లు, యూపీ స్కూళ్లు, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు హెచ్‌ఎంల ఆధ్వర్యంలో డీ వార్మింగ్ మాత్రలు వేశారు. అనంతరం విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని గమనించేందుకు వైద్య సిబ్బంది ఆయా పాఠశాలల్లో గడిపారు. పాఠశాలలకు గైర్హాజరైన విద్యార్థులకు ఈనెల 18వ తేదీన డీ వార్మింగ్ మాత్రలు వేస్తామని వైద్య సిబ్బంది వెల్లడించింది.

విధిగా తీసుకోవాలి

కొడవలూరు : ప్రతి చిన్నారి నులి పురుగుల నివారణ మాత్రలు విధిగా తీసుకోవాలని ఎంఈఓ జి.వసంతకుమారి సూచించారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా కొడవలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులకు మంగళవారం డీవార్మింగ్ మాత్రలు పంపిణీ చేశారు. కొడవలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎంఈఓ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలంటే విధిగా నులి పురుగుల నివారణ మాత్రలు వినియోగించాలన్నారు. వీటి ఆవశ్యకతను గుర్తించిన ప్రభుత్వం ప్రతి చిన్నారికి ఉచితంగా మాత్రలు పంపిణీ చేస్తోందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఎం.రామకృష్ణ, ఏఎన్‌ఎం శేషుబాయి, సీఆర్‌పీ జె.పెంచలరావు పాల్గొన్నారు.

మిక్కిలింపేటలో..

యల్లాయపాళెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మంగళవారం నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. మిక్కిలింపేట ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం పి.తిరుపాలు చేతుల మీదుగా విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. ఏఎన్‌ఎం కె.అనిత, ఆశా కార్యకర్త పి.పుష్ప పాల్గొన్నారు.

మాత్రల పంపిణీ

ఇందుకూరుపేట : మండలంలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం డీవార్మింగ్ మాత్రలు పంపిణీ చేశారు. మైపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ విజయ్‌శంకర్, జగదేవిపేట వైద్యాధికారిణి డాక్టర్ సుచిత్ర ఆధ్వర్యంలో సిబ్బంది చిన్నారులకు మాత్రలు వేశారు. ఈ సందర్భంగా నులిపురుగుల నివారణ మాత్రల వల్లే కలిగే ప్రయోజనాలను పిల్లలకు డాక్టర్లు వివరించారు.

అందరూ సహకరించాలి

తోటపల్లిగూడూరు : నులిపురుగుల నిర్మూలన విషయంలో అందరూ తమ వంతు సహకారాన్ని అందించాలని కోడూరు పీహెచ్‌సీ ఎంఎల్‌హెచ్ అరుణ సూచించారు. మండలంలోని సౌత్‌ఆములూరు ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ ప్రతి ఏడాది ఆరు నెలలకోసారి నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం జరుగుతుందన్నారు. విద్యార్థులు ఎప్పటికప్పుడు చేతులను శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఈ క్రమంలో పిల్లలకు ఏడు దశల్లో చేతులను శుభ్రపరుచుకునే విధానాన్ని వివరించారు. అనంతరం విద్యార్థులతో డీవార్మింగ్ మాత్రలను మింగించారు. కార్యక్రమంలో స్థానిక ఏఎన్‌ఎం శారమ్మ, ఉపాధ్యాయులు అహ్మదబాషా, సుభాషిణి, వసంత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం

బుచ్చిరెడ్డిపాళెం : వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉండొచ్చని ఎంపీడీఓ నరసింహరావు అన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలోని డీఎల్‌ఎన్‌ఆర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం డీవార్మింగ్ మాత్రలను విద్యార్థులకు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీ వార్మింగ్ మాత్రలతో నులిపురుగులు నశిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ దిలీప్ కుమార్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



కొడవలూరు హైస్కూల్‌లో విద్యార్థులకు మాత్రల పంపిణీ



కొడవలూరు : మిక్కిలింపేట ప్రాథమిక పాఠశాలలో..



ఇందుకూరుపేట : పల్లిపాడులో..



తోటపల్లిగూడూరు : విద్యార్థులతో మాత్రలు మింగిస్తున్న వైద్య సిబ్బంది



బుచ్చిరెడ్డిపాళెం : చిన్నారికి మాత్ర వేస్తున్న ఎంపీడీఓ నరసింహరావు



బుచ్చిరెడ్డిపాళెం : దామరమడుగులో..

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం : మోటారు బైక్ అదుపుతప్పి పడడంతో వ్యక్తి గాయపడిన సంఘటన మండలంలోని సర్వేపల్లి సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. గూడూరు పట్టణానికి చెందిన రవీంద్ర పనినిమిత్తం మోటారు బైక్‌పై ముత్తుకూరుకు వెళ్లాడు. తిరిగి గూడూరుకు వెళ్తుండగా సర్వేపల్లి సమీపంలో కృష్ణపట్నం పోర్టు రోడ్డుపై ఆటో అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో రవీంద్రకు గాయాలు కాగా చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వెంకటాచలం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మాదక ద్రవ్యాల అనర్థాలపై అవగాహన సదస్సు

వెంకటాచలం : మండలంలోని ఎర్రగుంట వద్ద ఉన్న స్వాతి బీ–ఫార్మసీ కళాశాలలో మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే అనర్థాలపై ఎస్‌ఈబీ అధికారులు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మాదక ద్రవ్యాలు కలిగి ఉన్నా, వినియోగించినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. మాదక ద్రవ్యాలు విక్రయించే వారి గురించి తెలిస్తే టోల్ ఫ్రీ నంబర్ 14500కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ సదస్సులో ఎస్‌ఈబీ అధికారులు వెంకటేశ్వరరావు, శకుంతలా దేవి పాల్గొన్నారు.

సర్వం సిద్ధం



బుచ్చిరెడ్డిపాళెంలోని ఇంటర్ పరీక్ష కేంద్రం

- నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చి పట్టణంలోని డీఎల్‌ఎన్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతి లేదని పరీక్షల నిర్వహణాధికారి కృష్ణప్రసాద్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే పరీక్షకు విద్యార్థులు అరగంట ముందే చేరుకోవాలని కోరారు. విద్యార్థులకు అన్ని వసతులు కల్పించామన్నారు. ఈ పరీక్ష కేంద్రంలో రెండు సెంటర్లను ఏర్పాటు చేశామని, మొదటి సంవత్సర ఇంటర్ పరీక్షకు 525 మంది హాజరుకానున్నట్లు తెలిపారు.

పరీక్ష కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు



కోవూరు : మాట్లాడుతున్న సీఐ రామకృష్ణారెడ్డి

కోవూరు : ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాల వద్ద గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని కోవూరు సీఐ కె.రామకృష్ణారెడ్డి తెలిపారు. కోవూరు పట్టణంలోని సీఐ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. కోవూరు సర్కిల్ పరిధిలో కోవూరు, ఇందుకూరుపేట మండలాల్లో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్ష సందర్భంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలియజేశారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసేలా ఆయా కేంద్రాల నిర్వాహకులు చూడాలన్నారు. ఆయన వెంట ఎస్సై దాసరి వెంకటేశ్వరరావు ఉన్నారు.

పకడ్బందీగా ఏర్పాట్లు

పొదలకూరు : మండల పరిధిలో ఇంటర్మీడియట్ పరీక్షలకు అధికారులు ఏర్పట్లు పూర్తి చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ, డీఎన్నార్ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలను పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. జూనియర్ కాలేజీలో ప్రథమ సంవత్సరం 240 మంది, ద్వితీయ సంవత్సరం 240 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. జెడ్పీహైస్కూల్లో ప్రథమ సంవత్సరం 236 మంది, ద్వితీయ సంవత్సరం 239 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు పేర్కొన్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.